సాక్షి
నిర్మల్
సోమవారం ၊ 2 ၊ సెప్టెంబర్ ၊ 2024



ఏ పంట.. ఎంత?

పంటల వివరాల నమోదును వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. ఏ రైతు.. ఎన్ని ఎకరాల్లో ఏ పంటలు పండిస్తున్నారో వివరాలు సేకరిస్తున్నారు. 9లో▸

నేటి ప్రజావాణి రద్దు

నిర్మల్‌చైన్‌గేట్‌: భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్‌ అభిలాష అభినవ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.1 /23.1

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

‘కడెం’ను సందర్శించిన అదనపు కలెక్టర్‌



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్‌ కిశోర్‌కుమార్‌

కడెం: భారీ వర్షాల నేపథ్యంలో అదనపు కలెక్టర్‌ కిశోర్‌కుమార్‌ ఆదివారం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్‌ నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్‌ సుజాత, ఆర్‌ఐలు లక్ష్మణ్‌, తక్కన్న, సిబ్బంది ఉన్నారు.

అనవసరంగా బయటకు రావొద్దు

పెంబి: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని అదనపు కలెక్టర్‌ కిశోర్‌కుమార్‌ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. ప్రజలను ఎప్పటికప్పుడు మైకులు, డప్పు చాటింపు ద్వారా అప్రమత్తం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ లక్ష్మణ్‌, ఆర్‌ఐ శ్రావణ్‌కుమార్‌ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్‌

మామడ: వర్షాకాలం నేపథ్యంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాజేందర్‌ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం తనిఖీ చేశారు. గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఉందని, సిబ్బంది తమ పరిధిలోని వసతి గృహాలను సందర్శించాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారానికి రెండు రోజులు డ్రైడే నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు శ్రీనివాస్‌, అరుణ్‌కుమార్‌ ఉన్నారు.

సంఘటితంగా అడ్డుకోవాలి

భైంసాటౌన్‌: హిందువులపై జరుగుతున్న దాడులను సంఘటితంగా అడ్డుకోవాలని వీహెచ్‌పీ విభాగ్‌ కార్యదర్శి టి.కృష్ణ అన్నారు. పట్టణంలోని పద్మావతి కాలనీలో గల శ్రీవేంకటేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం వీహెచ్‌పీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం వీహెచ్‌పీ మహిషా నగర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నగర అధ్యక్షుడిగా డా.మహిపాల్‌, ఉపాధ్యక్షులుగా డి.రాజేందర్‌, రంగు శ్రీనివాస్‌, కార్యదర్శిగా శివకుమార్‌, కోశాధికారిగా కల్యాణ్‌, భజరంగ్‌ సంయోజక్‌గా ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్‌ జిల్లా సహ సంఘచాలక్‌ కృష్ణదాస్‌, మాతృశక్తి ప్రాంత సంయోజక్‌ శ్రీవాణి, దామోదర్‌, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జుల్‌వార్‌ వెంకటేశ్‌, జిల్లా సహ కార్యదర్శి నవీన్‌, హిందూ ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.



గుండేగాం గ్రామంలోకి చేరిన వరద

వాన.. వరద

- జిల్లాలో జోరు వర్షం
- ఎగువ ప్రాంతాల నుంచి ప్రధాన ప్రాజెక్టులకు వరద
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- సురక్షిత ప్రాంతాలకు స్థానికుల తరలింపు
- పరిశీలించిన కలెక్టర్‌, ఎస్పీ, అధికారులు
- మరో 24 గంటలపాటు వర్షసూచన
- విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్‌

నిర్మల్‌: జిల్లాలో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మరో 24 గంటలపాటు వాన జోరు కొనసాగనుంది. జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కుభీర్‌ మండల కేంద్రంలోని పలు వీధులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి నీళ్లు చేరాయి. నదులు, వాగులు ఉప్పొంగుతుండటంతో లోలెవల్‌ వంతెనలు నీటమునిగి రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాతోపాటు ఎగువ ప్రాంతాల్లోనూ వర్షం కురుస్తుండటంతో ప్రాజెక్టుల్లోకి భారీగా ఇన్‌ఫ్లో చేరుతోంది. కడెం, స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. జిల్లా సరిహద్దుగా ఉన్న గోదావరిలోనూ నీటిమట్టం పెరుగుతోంది. కలెక్టర్‌ అభిలాష అభినవ్‌, ఎస్పీ జానకీషర్మిల పలు ప్రాజెక్టులు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వాతావరణ సూచనల మేరకు భారీ వర్షాలకు అవకాశం ఉండటంతో సోమవారం అన్ని విద్యాసంస్థలకు కలెక్టర్‌ సెలవు ప్రకటించారు.

పలు మండలాల్లో భారీగా..

బంగాళఖాతంలో నెలకొన్న వాయుగుండం ప్రభావం జిల్లాపై కొనసాగుతోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భైంసా, కుభీర్‌ మండలాల్లో 88.8మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా, కుంటాల, నిర్మల్‌లో 75మి.మీ. వరకు వర్షపాతం నమోదైంది. ముధోల్‌, సారంగపూర్‌, మామడ, లోకేశ్వరం, పెంబి, నర్సాపూర్‌(జి) మండలాల్లో 50– 62 మి.మీ.ల వరకు వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లోనూ మోస్తరు వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి భారీగా ఉరుములు మెరుపులతో వాతావరణం మరింత ఆందోళనకరంగా మారింది.

నీటమునిగిన లోతట్టు..

- భారీ వర్షాలకు కుభీర్‌, భైంసా, నిర్మల్‌, కుంటాల మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.
- కుభీర్‌ మండల కేంద్రంలోని మేదరివాడ ఇళ్లతోపాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోకి నీళ్లు రావడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.
- కుంటాల మండలంలోని లోలెవల్‌ వంతెనలు మునిగిపోవడంతో వెంకూర్‌, ఓలా, సూర్యాపూర్‌ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- భైంసా సమీపంలోని ముంపుగ్రామం గుండేగాంలోకి పల్సికర్‌ రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ వచ్చాయి.
- తానూరులో వాగులు ఉప్పొంగుతున్నాయి. ఝరి(బి)లో వంతెన పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది.
- జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల సైతం వర్షపునీటితో నిండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత

జిల్లాలో భారీ వర్షాలకు తోడు ఎగువన ఆదిలాబాద్‌, మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ వర్షం కురుస్తుండటంతో వాగులు, నదులు ఉప్పొంగుతున్నాయి. జిల్లా ప్రాజెక్టుల్లోకి ఓ స్థాయిలో వరదనీరు వస్తోంది. ముందుజాగ్రత్తగా గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టుకు ఆదివారం ఉదయం దాదాపు 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 10గేట్లు ఎత్తారు. క్రమంగా వరద తగ్గడంతో సాయంత్రం వరకు ఐదు గేట్లను మాత్రమే ఎత్తి ఉంచారు. స్వర్ణప్రాజెక్టుకు ఉదయం 15వేల క్యూసెక్కులు రాగా, మూడు గేట్లు ఎత్తారు. వరద తగ్గడంతో రెండుగేట్లకు పరిమితం చేశారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఉదయం ఒక గేటు ఎత్తగా క్రమంగా సాయంత్రానికి వరద 15వేలకు చేరడంతో మరో గేటును ఎత్తి ఉంచారు. జిల్లాలో మరో 24గంటల వర్ష సూచన ఉండటం, ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండటంతో ఇన్‌ఫ్లో కంటే ఎక్కువగానే అవుట్‌ఫ్లో ఉంచుతున్నారు. రెండేళ్ల క్రితం కడెం ప్రాజెక్టు పెట్టిన టెన్షన్‌ నేపథ్యంలో కలెక్టర్‌ అభిలాష అభినవ్‌, ఎస్పీ జానకీషర్మిల ఆనకట్టను పరిశీలించారు. ఇరిగేషన్‌ అధికారులు మొత్తం అక్కడే ఉండి అంచనా వేస్తూ నీటిని వదులుతున్నారు.

పునరావాసకేంద్రాలకు జీఎస్‌ఆర్‌ కాలనీవాసులు

జిల్లాకేంద్రంలోని స్వర్ణ పరీవాహకంలో ఉన్న జీఎస్‌ఆర్‌ కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎగువన గల స్వర్ణ ప్రాజెక్టుకు వరద వస్తుండటం, గేట్లు ఎత్తడంతో కాలనీవాసులను ముందుజాగ్రత్తగా సమీపంలోని అల్ఫోర్స్‌ స్కూల్‌, తదితర ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించారు.



పునరావాస కేంద్రాలకు వెళ్తున్న జీఎస్‌ఆర్‌ కాలనీవాసులు

ఆదివారం రాత్రి వరకు ప్రాజెక్టుల రిపోర్ట్‌

ప్రాజెక్టు	పూర్తిస్థాయి నీటిమట్టం (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటిమట్టం (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఎత్తిన గేట్లు	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
కడెం	7.603	6.444	22,490	05	19,213
గడ్డెన్నవాగు	1.852	1.701	15,000	02	24,625
స్వర్ణ	1.484	1.375	5,000	02	12,080

గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు



కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

పెంబి: మండలంలో భారీ వర్షాలకు కడెం, దోత్తి, పల్కేరు వాగు ఉప్పొంగాయి. దోత్తి వాగుపై వంతెన లేకపోవడంతో యాపలగూడ, రాంనగర్‌, వస్‌పెల్లి, దోందారి, చాక్‌రేవు తదితర గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కడెం వాగుపై పస్పుల వద్ద మూడేళ్ల క్రితం నిర్మించిన వంతెన కొట్టుకుపోవడంతో ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదు. పస్పుల, హరిచంద్‌తండా, కోరకంటి, తులసీపేట్‌, దయ్యాలమద్దికి రాకపోకలు నిలిచిపోయాయి. గుమ్మెన ఎంగ్లాపూర్‌ గ్రామానికి అటవీ మార్గంలో దోత్తి వాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన తెగిపోయింది.

గుండేగాం గ్రామంలోకి చేరిన వరద



గుండేగాంలో నీట మునిగిన శ్మశానవాటిక

భైంసారూరల్‌: శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి గుండేగాం గ్రామంలోని వరద చేరింది. పల్సీకర్‌ రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో మహాగాం గ్రామానికి వెళ్లే మార్గంలో గుండేగాం వద్ద వంతెన మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శ్మశానవాటిక సైతం వరద నీటిలో మునిగింది. మహాగాంలో పాత ఊరు, కొత్త ఊరు మధ్య వర్షపు నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం భైంసారూరల్‌ సీఐ నైలు గుండేగాం గ్రామాన్ని సందర్శించారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి



జీఎస్‌ఆర్‌ కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ అభిలాష అభినవ్‌

నిర్మల్‌చైన్‌గేట్‌: వర్షాల నేపథ్యంలో ఆస్తి, ప్రాణనష్టం లేకుండా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కలెక్టర్‌ అభిలాష అభినవ్‌ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జీఎస్‌ఆర్‌ కాలనీలో ఆదివారం పర్యటించారు. స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలు ఉత్పన్నమైతే కలెక్టరేట్‌లోని కంట్రోల్‌ రూం 63056 46600 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్‌, రెవెన్యూ, విద్యుత్‌, మున్సిపల్‌, ఇరిగేషన్‌, వైద్యశాఖలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్‌ ఫైజాన్‌ అహ్మద్‌, డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవో రత్నకల్యాణి, మున్సిపల్‌ కమిషనర్‌ రాజు, తహసీల్దార్‌ రాజు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

- ఎస్పీ జానకీషర్మిల



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్‌: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలోని జీఎస్‌ఆర్‌ కాలనీని ఆదివారం సందర్శించారు. రెండు రోజులపాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని ప్రాజెక్టులు, నది పరీవాహక ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, వాగుల వద్దకు పశువులను తీసుకెళ్లొద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యల్లో ఉంటే కంట్రోల్‌ రూం, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాష్‌, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు ప్రవీణ్‌కుమార్‌, రామకృష్ణ, మున్సిపల్‌ కమిషనర్‌ సీవీఎస్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం ఏర్పాటు చేశాం

నిర్మల్‌చైన్‌గేట్‌: జిల్లా కేంద్రంలోని జీఎస్‌ఆర్‌ కాలనీ ప్రజలకు పట్టణంలోని అల్ఫోర్స్‌ పాఠశాలలో తాత్కాలిక పునరావాసం కల్పించామని అదనపు కలెక్టర్‌ కిశోర్‌కుమార్‌ తెలిపారు. జీఎస్‌ఆర్‌ కాలనీలో ఆదివారం ఎస్పీ జానకీషర్మిలతో కలిసి పర్యటించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సమాచారం అందించాలని సూచించారు.



స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న సిద్దాపూర్‌ వాగు



నిండుకుండలా సోన్‌ మండలంలోని సంగంపేట్‌ చెరువు



కుభీర్‌ పీహెచ్‌సీ చుట్టూ చేరిన వరద

అధిక సంపాదన కోసం..

- సర్కారు నౌకరీ ఉన్నా..
- స్వల్పకాలంలో అధిక డబ్బులే లక్ష్యంగా..
- అప్పులు చేసి ‘యూబిట్‌’ పేరిట రూ.లక్షల్లో పెట్టుబడి
- ఆధారాలు లేకుండా.. ఆన్‌లైన్‌లోనే దందా!
- ఫిర్యాదులతో నిఘా పెట్టి పట్టుకున్న పోలీసులు

నిర్మల్‌: ‘మీరు కాసుల కోసం ఎక్కడికో పోవాల్సిన అవసరం లేదు. చెమటచుక్కలూ చిందించాల్సిన పనిలేదు. రూ.లక్ష పెట్టి చూడండి.. నెలకు రూ.10వేలకు పైగా పొందండి. ఇంకా కొంచెం కష్టమైనా పర్వాలేదు. అప్పుచేసినా తప్పులేదు.. రూ.5లక్షలు పెట్టేయండి.. మీకు నెలకు రూ.లక్షపైగా వస్తాయి. నో డౌట్‌. ఇందులో ఎలాంటి అనుమానం పెట్టుకోకండి. మీకంతగా అనుమానం ఉంటే చెప్పండి... ఇదిగో మీరు పెట్టే డబ్బు మీకు తిరిగి వచ్చేదాకా నేను మీకు చెక్కు ఇస్తున్నా తీసుకోండి. మీ డబ్బుకు, మీకు లాభాలు రావడానికి నాదీ పూచీకత్తు. అరె.. నేను ఒక ప్రభుత్వ ఉద్యోగిని నేనే.. ఇందులో ఇంతింత పెట్టుబడి పెడుతున్న.. ఒక్కసారి డబ్బులు పెడితే ఊహించని లాభాలు వస్తూనే ఉంటాయి..’

ఇదిగో ఇలా.. చెబుతున్న మాటలే వందలమందిని ఊబిలాంటి యూబిట్‌లోకి దించాయి. రూ.లక్షల్లో లాభాలు కనిపించడంతో అత్యాశ పెరిగి మరింత మందిని లాగుతూ వచ్చారు. కొంతమంది మధ్యతరగతి కుటుంబాలవాళ్లు బంగారం, ప్లాట్లు అమ్మి మరీ ఇందులో డబ్బులు పెట్టారు. టీచర్లు, ఉద్యోగులు, అధికారులే ఉండటంతో ఆస్తులను తాకట్టు పెట్టి చేరారు. ఇలా పెరిగిన చైన్‌లింక్‌లో ఇప్పుడిప్పుడే లోపాలు బయటపడుతుండటంతో ఎస్పీ జానకీషర్మిల ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెట్టారు. జిల్లాలో ఈ కాయిన్‌దందాలో కీలకంగా ఉన్న ఐదుగురిని శనివారం అదుపులోకి తీసుకుని ఆదివారం రిమాండ్‌కు పంపించారు. ప్రస్తుతం జిల్లా అంతటా ఇదే ఘటనపై చర్చ సాగుతోంది. ఊహించని లాభాలు వస్తుండటంతో మేధావులూ కనీసం ఆలోచించలేదు. ఉపాధ్యాయ, ఉద్యోగులే కాదు.. ఏకంగా జిల్లాస్థాయి అధికారులూ రూ.లక్షల్లో ఆన్‌లైన్‌ దందాలో పెట్టుబడి పెట్టేశారు. పదుల సంఖ్యలో బంధుమిత్రులు, సహచరులతో పెట్టించేశారు.

అలా మొదలై..

గతంలో ఎన్నో చైన్‌లింక్‌ దందాలు వచ్చివెళ్లాయి. జిల్లాలోనూ ఇలాంటి వాటిల్లో పెట్టుబడులు పెట్టి చేతులు కాల్చుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా బిట్‌ కాయిన్‌ క్రిప్టోకరెన్సీపై చర్చ నడిచింది. ఆ పేరుకు కాస్త అటుఇటుగా పెట్టేసి మార్కెట్లోకి వదులుతున్నారు. అలా జిల్లాలో ప్రస్తుతం యూబిట్‌ పేరు బాగా వినిపిస్తోంది. ఆర్మీలో పనిచేసిన కడెం మండలానికి చెందిన ఓ యువకుడి ద్వారా జిల్లాలో మొదలైనట్లు చెబుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన తన మిత్రులు, ఖానాపూర్‌ నియోజకవర్గంలో తెలిసినవాళ్లతో మొదలై.. ఇప్పుడు జిల్లాలో, పక్కనున్న జగిత్యాల జిల్లాలోనూ విస్తరించింది. ఇలాంటి దందాలు ఎప్పుడు ఆగిపోతాయో చెప్పలేమని, ఒకే టీమ్‌ ఇలాంటి దందాలను పేరుమార్చుతూ మార్కెట్లోకి వదులుతాయని భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్‌ వివరించారు. ఇలాంటి వాటిపై ఆన్‌లైన్‌లో సెర్చ్‌ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

ఫిర్యాదు చేయాలి


జిల్లాలో యూబిట్‌ తదితర ఆన్‌లైన్‌ కంపెనీల పేరిట నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దందాలను నమ్మి మోసపోవద్దు. ఇప్పటికే జిల్లాలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నాం. ఇలాంటి ఆన్‌లైన్‌ వ్యాపారాలతో చాలా కుటుంబాలు అప్పుల పాలయ్యాయి. ఇప్పుడిప్పుడే ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటి వాటిపై బాధితులు నేరుగా ఎస్పీ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేయవచ్చు.

– జానకీషర్మిల, ఎస్పీ

విధులకు ఎగనామం పెట్టి..

జిల్లాలో యూబిట్‌ వంటి దందాల్లో ఎక్కువగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. పోలీసులు శనివారం పట్టుకున్నవారి వివరాలను ఎస్పీ జానకీషర్మిల ఆదివారం జిలాకేంద్రంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ఇందులో కడెం మండలం నవాబ్‌పేటకు చెందిన సల్ల రాజ్‌కుమార్‌ను కీలకవ్యక్తిగా గుర్తించారు. గతంలో ఆర్మీలో చేసిన రాజ్‌కుమార్‌ ప్రస్తుతం ఆన్‌లైన్‌ దందాలోనే ఫుల్‌టైమ్‌ పనిచేస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌ ఎక్సైజ్‌ ఎస్సైగా చేస్తున్న నిర్మల్‌వాసి గంగాధర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని పలు మండలాల్లో ఆయన ఎంపీడీవోగానూ పనిచేసి ఉండటం, ఉమ్మడి జిల్లాస్థాయిలో పరిచయాలు ఉండటంతో చర్చకు కారణమైంది. అలాగే రాజ్‌కుమార్‌ మిత్రులైన దస్తురాబాద్‌ మండలం రాంపూర్‌ టీచర్‌ సాయికిరణ్‌, ఏఆర్‌ కానిస్టేబుల్‌ మహేశ్‌, అలాగే కడెం మండలం గంగాపూర్‌ పాఠశాల ఉపాధ్యాయుడు కండెల నరేశ్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరే కాకుండా జిల్లాలో పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగులు కీలకంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయశాఖలో పనిచేస్తూ ఉద్యోగ సంఘంలో చురుకుగా ఉండే ఓ అధికారి, విద్యాశాఖకు చెందిన పలువురు ఉద్యోగులు, జిల్లాకేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉండే ఉపాధ్యాయుడు ఇలా.. చాలామంది ఇందులో సభ్యులను చేర్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు తేలింది. వీరంతా తమ విధులను పక్కన పెట్టి ఈ దందాలో భాగమవుతున్నారు. చైన్‌లింక్‌ పెంచేందుకు గిఫ్టులు, టూర్లు, కార్లు కూడా ఇస్తుండటం గమనార్హం. ‘సార్‌.. ఇంతింత పెట్టుబడి పెడుతున్నాం కదా.. మరి రేపొద్దున ఈ కంపెనీ పోతే ఎట్లా..!?’ అని ఎవరైనా అడిగితే.. ‘అవన్నీ ఆలోచించొద్దు.. ఇప్పుడు లాభాలు వస్తున్నాయి కదా.. మనమైతే తీసుకుందాం. తర్వాత వాళ్ల సంగతి మనకెందుకు..’ అని నేరుగానే చెబుతుండటం గమనార్హం. చాలామంది ఇదే కాసుల కక్కుర్తికి ‘కాయిన్స్‌’ వలలో చిక్కుకుపోతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

మత్స్యం.. మురిపెం





కడెం ప్రాజెక్ట్‌ 14, 16, 17 నంబర్‌ గేట్లు ఎత్తి మళ్లీ మూసివేయడంతో ఆదివారం స్థానికులు వరద గేట్ల కింద చేపల వేటకు దిగారు. గేట్లు మూసిన తర్వాత గుంతల్లో చేపలు పట్టారు. అక్కడే కిలోకు రూ.80 నుంచి రూ.100 చొప్పున విక్రయించారు. - కడెం

సహాయక చర్యలు చేపట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్‌: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదారాబాద్‌ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, అధికారులతో వర్షాలపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లోని కంట్రోల్‌ రూంలకు అందిన ఫిర్యాదులపై స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం సీఎస్‌ శాంతికుమారి మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్‌ అభిలాష అభినవ్‌ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు. శిథిలావస్థలోని ఇళ్లను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. చెరువులు, కుంటల వద్దకు ఎవరూ వెళ్లకుండా నిఘా ఉంచామని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లు మూసివేసి తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఎస్పీ జానకిషర్మిల మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ అప్రమత్తంగా ఉందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ కిషోర్‌ కుమార్‌, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్‌, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్ఫేస్ జనరల్ మజ్దూర్ లెటర్లు ఇవ్వాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా ఎంపిక చేసిన వారికి వెంటనే లెటర్లు ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మొత్కూరి కొమురయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీ ప్రక్రియ చేపట్టి ఎంపికైన వారికి ఇంకా లెటర్లు ఇవ్వకుండా జాప్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే లెటర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బ్లాస్టింగ్ కార్మికుల కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ)ఆధ్వర్యంలో బ్లాస్టింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఓసీపీపై యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు బ్లాస్టింగ్ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా అగ్గ కిరణ్, కార్యదర్శిగా ఆకుల నరేశ్, ఉపాధ్యక్షుడిగా పెద్దింటి సుధాకర్, సహాయ కార్యదర్శిగా బండారి బండారి సత్తయ్య, కోశాధికారిగా సుద్దుల శంకర్, కమిటీ సభ్యులుగా తోట సురేశ్, బండారి సురేశ్, ఆకుల సుభాశ్, గొల్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

పిడుగుపాటుకు ముగ్గురికి స్వల్పగాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని సాలేగూడ గ్రామానికి బాన్నే సుజాత, మందబాయి, సావితలు పిడుగుపాటుకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..శనివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వస్తుండగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగుపడగా గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వారిని జిల్లాకేంద్రంలో ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు.

'కళాశాల అభివృద్ధికి పాటుపడుతా'



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

ఇచ్చోడ: ఇచ్చోడలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పాటుపడుతానని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కళాశాలలో సౌకర్యాల కల్పన, నాన్ టీచింగ్ నియామకం, నూతన భవన నిర్మాణం కోసం కృషిచేస్తానన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కట్కం మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, కట్ట వేణు, మహేష్, నిర్మల్ జిల్లా కార్యదర్శి రవికుమార్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌రావ్, దయాకర్, ఉట్నూర్ ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, లెక్చరర్లు సరితా, రాణి, తిరుపతి, ప్రభాత్ రావు, విజయ్ పాల్గొన్నారు.

కాలినడకన హజ్‌యాత్రకు..

వాంకిడి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన మహమ్మద్ అబ్దుల్ అబిద్ కాలినడకన హజ్‌యాత్రకు బయల్దేరాడు. ఆదివారం వాంకిడి చేరుకోగా, ముస్లిం పెద్దలు, యువకులు స్వాగతం పలికారు. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం మైనార్టీ సభ్యులు అబిద్‌తో కలిసి మహారాష్ట్ర సరిహద్దు గోయేగాం వరకు కాలినడకన వెళ్లి వదిలారు.

నిండుకుండలు..



మహారాష్ట్రతోపాటు ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టులను పరిశీలించి.. పలు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీన్ని వీక్షించేందుకు పలువురు రావడంతో ప్రాజెక్టుల వద్ద సందడి నెలకొంది.

కడెంకు పోటెత్తిన వరద



కడెం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కడెం ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. ఆదివారం ఉదయం ప్రాజెక్ట్‌కు 65,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. అప్రమత్తమైన అధికారులు పది వరద గేట్లు ఎత్తి 79,850 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ఐదు వరద గేట్ల ద్వారా 18,381 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 694.675(6.285టీఎంసీ) అడుగులు ఉంది. అధికారులు ప్రాజెక్ట్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



'స్వర్ణ'నాలుగు గేట్లు ఎత్తివేత



సారంగపూర్: మండలంతోపాటు మహారాష్ట్రలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి వరద చేరుతోంది. అధికారులు ఆదివారం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు(1.484 టీఎంసీలు) కాగా, 80 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో 4 గేట్ల ద్వారా 80 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించారు. ఈఈ లక్ష్మి, డీఈ శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మరో రెండు రోజులు వర్షసూచన ఉన్న నేపథ్యంలో ప్రజలు స్వర్ణ నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లొద్దని సూచించారు. పశువుల కాపర్లు, మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జేఈలు మధుపాల్, దేవేందర్, తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

'మత్తడివాగు'మూడు గేట్లు..



తాంసి: తాంసి, తలమడుగు మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం కురిసిన వర్షానికి మత్తడివాగు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. అధికారులు ఆదివారం మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో ద్వారా 16,660 క్యూసెక్కుల వరద నీరు రాగా, 3 గేట్లు ఎత్తి 17,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తిస్థాయి నీటి మట్టం 277.5 మీటర్లు కాగా, ప్రస్తుతం 277.20 మీటర్ల వద్ద నిల్వ ఉండేలా నీటిని వదిలేస్తున్నట్లు ఇంజినీర్ హరీశ్‌కుమార్ తెలిపారు.

'అడ', 'వట్టి' గేట్లు..



ఆసిఫాబాద్‌రూరల్: అడ ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తి 3200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తి స్థాయి నీటిమట్టం 10.393 టీఎంసీలు (243 మీటర్లు) కాగా ప్రస్తుతం 5.809 టీఎంసీలు వాటర్ లెవల్ 237.700 మీటర్లుగా ఉంది. వట్టివాగు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 360 క్యూస్కెల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 2.89 టీఎంసీలు (238.50 మీటర్లు) ప్రస్తుతం 2.329 టీఎంసీలు ఉంది. ఇన్ ఫ్లో 750 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో ద్వారా 360 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

గడ్డెన్నవాగుకు వరద



భైంసాటౌన్: గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ప్రాజెక్టులోకి 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయి నీటిమట్టానికి(358.40మీ) చేరుకుంది. అధికారులు రెండు గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. గంటగంటకు వరదనీటి ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు దిగువన ఆటోనగర్ బైపాస్‌రోడ్డు మార్గంలో వంతెన నీట మునగగా, ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపేశారు.

'కుంటాల'కు జలకళ



నేరడిగొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కుంటాల జలపాతానికి వరద నీరు పోటెత్తింది. దీంతో జలపాతం వద్ద పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవుదినం కావడంతో ఇక్కడి అందాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రకృతి సహజ సిద్ధమైన పచ్చని అడవి తల్లి ఒడిలో సెలయేళ్ల పరవళ్లు తొక్కుతున్న జలధారాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. జాలువారే అందాలను చూసి వారు మంత్రముగ్ధులవుతున్నారు. జలపాతం వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

సాత్నాల గేటు..



జైనథ్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాత్నాలలోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో అధికారులు ఆదివారం మొదటి గేటును ఎత్తారు. రెండవ గేటును 0.1 మీటర్ల ఎత్తులో ఎత్తి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీళ్లను వదులుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. 1.24 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 285.70మీటర్ల ఎత్తులో 1.056టీఎంసీ నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు సమాచారం.

అనాథలుగా ఇద్దరు పిల్లలు

- రెండు నెలల క్రితం తల్లి ఆత్మహత్య
- శనివారం మూర్ఛవ్యాధితో తండ్రి మృతి
- సిరికొండలో ఘటన



అనాథలు అయిన పిల్లలు

సిరికొండ: రెండు నెలల క్రితం తల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, తండ్రి మూర్ఛ వ్యాధితో శనివారం మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సిరికొండ గ్రామ పంచాయతీలో దాసరి శ్రీనివాస్ మల్టీపర్పస్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో రెండు నెలల క్రితం భార్య దాసరి రజిత ఆత్మహత్య చేసుకుంది. శ్రీనివాస్ తన ఇద్దరు పిల్లలు మేఘన(13), రిషి(12)ను చూసుకుంటున్నారు. వారిని నానమ్మ ఆడేల్ల వద్ద ఉంటున్నారు. కాగా, సిరికొండకు చెందిన ముత్యాపు లాస్య శుక్రవారం మృతి చెందింది. శనివారం అంత్యక్రియలకు కట్టెల కోసం గ్రామస్తులతో కలిసి శ్రీనివాస్ అడవికి వెళ్లాడు. అక్కడే మూర్ఛ వచ్చి మృతి చెందాడు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. పిల్లల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. శ్రీనివాస్ తల్లి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.

హత్యకు దారితీసిన గొడవ

- టీవీ చానల్ మార్పు విషయమై..
- కొత్తపల్లి-హెచ్ కొలాంగూడలో ఘటన



లక్ష్మణ్ (ఫైల్)

నార్నూర్: టీవీ చానల్ మార్పు విషయమై జరిగిన గొడవ ఒకరి హత్యకు దారితీసింది. మండలంలోని కొత్తపల్లి-హెచ్ కొలాంగూడ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ రహీంపాషా కథనం ప్రకారం..గ్రామానికి చెందిన సిడాం మంతుబాయి-లక్ష్మణ్ దంపతులు కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన మాడవి రాముతో కలిసి లక్ష్మణ్(35) కొడప జైతు ఇంట్లో టీవీ చూడటానికి వెళ్లారు. టీవీ చూస్తుండగా చానల్ మార్పు విషయంపై ఇద్దరికి గొడవ జరిగింది. ఆ సమయంలో జైతు లేకపోవడంతో గొడవ పెరిగింది. గమనించిన మంతుబాయి తన భర్త లక్ష్మణ్‌ని ఇంటికి తీసుకెళ్తుంది. వెనుక నుంచి వచ్చిన రాము.. లక్ష్మణ్‌పై దాడి చేసి ఆయర ఛాతీపై కూర్చొని పిడికిలతో గుద్ది, గొంతునొక్కడంతో స్పృహ కోల్పోయాడు. మంతుబాయి అరుపులు విన్న స్థానికుడు సిడం భుజంగరావు అక్కడికి వస్తుండగా రాము పారిపోయాడు. గ్రామస్తుల సాయంతో లక్ష్మణ్‌ను ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని బెస్తవాడలో కోడి పందేల స్థావరంపై నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మిగతా 11 మంది పరారయ్యారు. ఘటన స్థలం వద్ద 3 కోడిపుంజులు, మూడు కత్తులు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి పాల్పడిన ఒకరి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడ కు చెందిన అండె సురేశ్ కిరాణా షాపులో గత నెల 26న చోరీ చేసిన షేక్ అయాన్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపా రు. గణేశ్‌మందిర్ ఎదుట ఆదివారం వాహనా లు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి అయాన్‌ను విచారించగా, చోరీ చేసినట్లు అంగీకరించారు. ఆయనతోపాటు మరో వ్యక్తి చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రేతను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపా రు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన షేక్ కలీమ్ ఆదివారం సుందరయ్యనగర్‌లోని మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద ప్లాస్టిక్ కవర్‌లో 510 గ్రాముల గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఎస్సై విష్ణుప్రకాశ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా గంజాయి లభించింది. గంజాయితోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఈయన వారం క్రితం మహారాష్ట్రలోని పాండర్‌కొడకు చెందిన హనుమాన్ నుంచి కిలో గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నారని సీఐ పేర్కొన్నారు.

ఒర్రెలో గల్లంతై ఒకరు మృతి



గణేశ్ మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: ఒర్రెలో గల్లంతై ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని బొందగూడ గ్రామానికి చెందిన టేకం గణేశ్ (35) శనివారం ఉదయం పశువుల మేతకు వెళ్లాడు. సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గ్రామ సమీపంలో ఒర్రెలో నీటి ప్రవాహం ఎక్కువ ఉంది. కాసేపు అక్కడే ఉన్న తర్వాత ఒర్రె దాటుతుండగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు రాత్రి గాలించిన ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటికి తీశారు. తండ్రి భీము ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

వాగులో పడిన ఐచర్ వాహనం

- ఈత రావడంతో నలుగురు కూలీలు, ఒక డ్రైవర్ సురక్షితం
- తాడు సాయంతో బయటకు..

నిర్మల్‌రూరల్: అతివేగంగా వస్తున్న ఐచర్ వాహనం అదుపుతప్పి వాగులో పడింది. ఆదివారం సాయంత్రం నిర్మల్ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సాయికుమార్, స్థానికులు తెలిపిన వివరాలు.. ఖానాపూర్‌కు చెందిన చాంద్‌పాషా స్థానికంగా ఐచర్ డీసీఎం ఓనర్ కమ్ డ్రైవర్‌గా వాహనం నడిపిస్తుంటాడు. ఆదివారం నలుగురు కూలీలను వెంటబెట్టుకుని ఖానాపూర్ నుంచి భైంసాకు లోడ్‌తో వెళ్లాడు. తిరిగివస్తుండగా వాహనం అదుపుతప్పి మండలంలోని చిట్యాల వద్ద బ్రిడ్జిని ఢీకొంది. పైనుంచి వాగులో పడిపోయింది.

ప్రాణాలు కాపాడిన ఈత

వాహనం వాగులో పడడంతో స్థానికులు గమనించారు. అందులో నలుగురు కూలీలు షాకీబ్, హైదర్, ఎస్ డి.సమీర్, అయాబు, డ్రైవర్ చాందపాషాలకు ఈత రావడంతో స్థానికులు తాడు సహాయంతో బయటకు వచ్చారు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వారిని నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వారికి ఈత రావడంతో ప్రాణాలు కాపాడుకున్నారు. భారీ వర్షాలకు స్వర్ణ వాగు పొంగడంతో వాహనం నీటిలో మునిగిపోయింది. రాత్రి వరకు రూరల్ పోలీసులు, అధికారులు వాహనాన్ని బయటకు తీయడానికి ప్రయత్నించారు.

సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఆదివారం రాత్రి గిరిజన సూపర్ మార్కెట్‌లో స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, పిడుగుపాటుకు సీసీ కెమెరాలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పి వేశారు. ప్రమాదంలో రూ.50 వేల నుంచి రూ.లక్ష లోపు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్, ఎల్ఎఫ్ ఎంఏ ముబీన్, సిబ్బంది సదానందం, వేణు, ఎం.మధుకర్, విఘ్నేశ్వర్ ఉన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో పద్మశాలీలకు అధిక సీట్లు ఇవ్వాలి

- రాష్ట్ర అధ్యక్షుడు మురళి




రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు పద్మశాలీలకు అధిక సీట్లు ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్తపు మురళి డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన జిల్లా సంఘ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేతన్న బీమాకు రూ.6 కోట్లు, బతుకమ్మ చీరల బకాయిలు రూ.150 కోట్లు, చేనేత సహకార సంఘాల బకాయిలు రూ. 25 కోట్లతోపాటు ఎల్ఐసీ నిబంధనల ప్రకారం నేతన్న బీమా వర్తించని కార్మికులకు ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. నిధుల విడుదల చేయించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హ్యాండ్లూమ్ కమిషనర్ శైలజ రామయ్యర్‌కు చేనేత వర్గాల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మురళిని సంఘం నాయకులు సన్మానించారు. గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, కోశాధికారి రఘురాం నేత, రాష్ట్ర ఉపాధ్యక్షులు బేత రమేష్, జక్కుల సత్యనారాయణ, తాలుకా పద్మశాలి సంఘం డివిజన్ అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి చిలక విలాస్, నాయకులు కామన్ విఠల్, మోర ఆశన్న, బూర్ల శంకరయ్య, దాసరి రమేష్, దాసరి ఆశన్న, మోర కిష్టన్న, గాజుల హనుమాన్లు, అనుముల ఊషన్న, వీరన్న, అన్నం నందు కుమార్, రమేశ్, నరేందర్ పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అత్తారింటి వేధింపులు తాళలేక జైపూర్ మండలం కుందారం చెందిన వివాహిత పురుగుల మందు తాగింది. కడుపునొప్పి బాధ భరించలేక చెన్నూర్‌లో వివాహిత, అప్పుల బాధతో ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంటకు చెందిన ఒకరు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. బెజ్జూర్ మండలం సిద్దాపూర్‌కు చెందిన ఒకరు మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉరేసుకుని వివాహిత..




మంజుల మృతదేహం

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడకు చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాలు.. భీమారం మండలం కాజిపల్లికి చెందిన మంజుల (35), చెన్నూర్‌కు చెందిన కడవండి మహేశ్‌ను ప్రేమించి గత 17 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వీరికి ముగ్గురు కుమారులు. మహేశ్ తాపీమేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెళ్లినాటి నుంచి తల్లిదండ్రులతో సంబంధాలు లేవు. కాగా, గత రెండేళ్లుగా మంజల కడుపునొప్పితో బాధపడుతుంది. ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది.

వేధింపులతోనే..

నా బిడ్డ కడుపు నొప్పితో మృతి చెందలేదని, భర్త మహేశ్ వేధింపులతోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి గోదారి లక్ష్మణ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

అత్తారింటి వేధింపులకు వివాహిత..



శరణ్య(ఫైల్)

జైపూర్: వరకట్నం తేవాలని అత్తారింటి వేధింపులు భరించలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన దాసరి శరణ్య(19) కుందారం గ్రామానికి చెందిన దాసరి సతీశ్, శరణ్యలది ఎదురెదు ఇళ్లు. వీరిది ఒకే కులం కావడం, ఒకరికొకరు ఇష్టపడ్డారు. గతేడాది మార్చిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆరు నెలలు గడవముందే ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. కట్నం కోసం సతీశ్ కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేసేవారు. మనస్తాపం చెందిన శరణ్య గతనెల 25న పురుగుల మందు తాగింది. మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కాగా, శరణ్య పురుగుల మందు తాగక ముందు రెండ్రోజుల క్రితం సతీశ్ ఆత్మహత్యకు యత్నించాడు. కరీనంగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

బెజ్జూర్: మండలంలోని సిద్దాపూర్‌కు చెందిన టాకిరే వసంత్ (48) శనివారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. భార్య నిర్మల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

ఇంద్రవెల్లి: అప్పుల బాధ భరించలేక ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. మండలంలోని ఏమాయికుంట గ్రామానికి చెందిన కేంద్రే దత్త(41) డ్రైవర్‌గా పని చేసి కుటుంబాన్ని పోసిస్తున్నాడు. గతేడాది ఇంటి అవసరం కోసం మండలకేంద్రానికి చెందిన కేంద్రే శివాజీ వద్ద రూ.6 లక్షలు, గోర్పనే దీప నుంచి రూ.50 వేలు, ఆదిలాబాద్ మండలంలోని చిచ్ధరిఖానాపూర్‌కు చెందిన పవార్ ప్రకాశ్ వద్ద నుంచి రూ.3.50 లక్షల అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని వారు ఇంటికి వచ్చి బెదిరించేవారు. డబ్బులు ఇవ్వకుంటే ఉరేసుకుని చనిపో అంటూ హింసించేవారు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో దత్త ఉరేసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని కుటుంబీకులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ఆశాతాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు అనికేత్, కావేలి ఉన్నారు.